క్లుప్తంగా

పేదల భూములకు పట్టాలు ఇవ్వాలి

రౌతులపూడి: మండలంలోని కోడూరు, పారుపాక, ఎస్.అగ్రహారం, పల్లపు చామవరం గ్రామాల్లో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక లిబరేషన్ పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో లిబరేషన్ పార్టీ నాయకులు సామిరెడ్డి నారాయణమూర్తి, మానుకొండ లచ్చబాబు, ఆవాల అప్పలరాజు, కాకర జైరాజ్, పూసల సింహాచలం, కంచి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చర్చి ట్రెజరర్‌కు సన్మానం



ఏలేశ్వరంలో చర్చి ట్రెజరర్ దంపతులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

ఏలేశ్వరం: పట్టణంలోని లూథరన్ చర్చి ట్రెజరర్ డి.వత్సలరావును సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక కాలేజ్ రోడ్డులోని లూథరన్ చర్చిలో పాస్టర్ కె.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు వత్సలరావు, స్వర్ణకుమారిలకు శాలువా, మెమెంటోలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా వత్సలరావు చర్చి ట్రెజరర్‌గా సేవలు అందిస్తున్నారని తెలిపారు. వత్సలరావు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు త్రిమూర్తులు, పేకల జాన్, డి.గణేష్, అభిశేఖరరావు, ఇజ్రాశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తనిఖీ



మల్లేపల్లిలో పింఛన్ లబ్ధిదారుని ఇంటి వద్ద తనిఖీ చేస్తున్న వైద్య బృందం

గండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వైద్య బృందం పింఛన్లు తనిఖీ చేసినట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. గండేపల్లి, మల్లేపల్లి, నీలాద్రిరావుపేట, ఎన్టీ రాజాపురం, జెడ్.రాగంపేట, యల్లమిల్లి గ్రామాల్లో ఆరోగ్య సంబంధిత పింఛన్లు పొందుతున్న తొమ్మిది మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తనిఖీలు చేసినట్టు వివరించారు.

ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తుని రూరల్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం గ్రామస్థాయిలో సచివాలయం, మండలస్థాయిలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎస్.సాయి నవీన్ తెలిపారు. మండల స్థాయిలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ గ్రామాల్లో పరిష్కారంకాని సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్మార్త, ఆగమ పరీక్షల్లో ఉత్తీర్ణత

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానంలోని సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాలకు చెందిన 21 మంది విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన జనార్దనానంద సరస్వతీస్వామి ట్రస్ట్ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఈ పరీక్షలకు నాలుగో సంవత్సరం స్మార్త విద్యార్థులు తొమ్మిది మంది, మూడో సంవత్సరం విద్యార్థులు 13 మంది హాజరయ్యారు. స్మార్తం, పంచతంశకర్మల్లో తొమ్మిది మంది, స్మార్త ప్రవేశ పరీక్షల్లో 12 మంది ఉత్తీర్ణులైనట్టు ఆగమపాఠశాల హెచ్‌ఎం అరాద్యుల లక్ష్మీనర్సింహమూర్తి తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ఈఓ వీర్ల సుబ్బారావు అభినందించారు.

గోకులం షెడ్డు ప్రారంభం

కిర్లంపూడి: గోకులం షెడ్లతో పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. వీరవరంలోని బొంగు శ్రీను పొలంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీతో కలసి సోమవారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ అంబటి బొజ్జమ్మ, ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

తుని: వాకర్స్ హెల్త్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు డీఎస్ మూర్తి తల్లి వెంకట రమణమ్మ జయంతి సందర్భంగా సోమవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్టు క్లబ్ పాస్ట్ గవర్నర్ చదరం శివాజీ తెలిపారు. స్థానిక ఫీడర్ రోడ్డులో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి భోజనం అందజేశారు. ప్రస్తుత శీతాకాలంగా వృద్ధులకు దుప్పట్లు ఎంతగానో ఉపయోగపడతాయని కుందెం సత్యనారాయణ అన్నారు. వాకర్స్ క్లబ్ సభ్యులు దణ్యంరాజు సత్యసాయి, ప్రసాద్, ప్రభావతి, శ్రీనివాస్, బాబూరావు, డేనియల్ జోసెఫ్, పి.బాబూరావు, వేణు గోపాలస్వామి పాల్గొన్నారు.

అరకొరగా.. అంతంతమాత్రంగా...

- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పూర్తిస్థాయిలో అందని పౌష్టికాహారం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులు
- నాణ్యమైన పోషకాహారం అందించాలని మొర



గంగవరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న కార్యకర్త

రౌతులపూడి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందడం లేదు. లబ్ధిదారులకు అరకొరగా పోషకాహారం అందడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల భోజనం తయారీకి అవసరమయ్యే బియ్యం, కందిపప్పు, నూనె, పాలు, గుడ్లతో పాటు కూరగాయలు, ఆకుకూరలు, గ్యాస్ వంటి వాటిని ప్రభుత్వమే సమకూర్చాల్సి ఉంది. అలాగే సంపూర్ణ ఆరోగ్యం కోసం మంచి పోషక విలువలు కల్గిన ఖర్జూరం, వేరుశనగ చిక్కీలు, బెల్లం, రాగిపిండి, గోధమ పిండితో కూడిన పౌష్టికాహారాన్ని ప్రతి నెలా క్రమం తప్పకుండా సరఫరా చేయాలి. వీటిలో చిన్నారుల భోజనం తయారీకి అవసరమైన కందిపప్పు ఏడాది కాలంగా అంగన్‌వాడీ కేంద్రాలకు చేరడం లేదు. దీంతో అంగన్‌వాడీలు భోజనం తయారీకి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంట నూనె, పాలు వంటివి సకాలంలో అందకపోవడంతో నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు.

మండలంలో 59 అంగన్‌వాడీ కేంద్రాలు

మండలంలోని రౌతులపూడి, ఎస్.పైడిపాల సెక్టార్లలో మొత్తం 59 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో రౌతులపూడి సెక్టార్‌లో గర్భిణులు 137, బాలింతలు 212, ఆరు నెలలు నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 901 మంది, మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 393 మంది ఉన్నారు. ఎస్.పైడిపాల సెక్టార్‌లో గర్భిణులు 91 మంది, బాలింతలు 117 మంది, ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 623 మంది, మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 228 మంది ఉన్నారు.

అందించే పౌష్టికాహారం

గర్భిణులు, బాలింతలకు నెలకు పోషకాహార కిట్, గుడ్లు 25, పాలు 5 లీటర్లు, బియ్యం 3 కిలోలు, కందిపప్పు కిలో, నూనె 500 గ్రాములు ఇస్తున్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు పాలు 6 లీటర్లు, గుడ్లు 30, బాలామృతం ప్యాకెట్‌ను ప్రభుత్వం అందిస్తోంది.

పెరిగిన కూరగాయల ఖర్చు

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల పిల్లల (ప్రీ స్కూల్ పిల్లలు)కు వండిపెట్టేందుకు ఆకుకూరలు, కూరగాయలు రోజువారీగా కొనుగోలు చేయాలి. వీటితో పాటు చింతపండు, కారం, పసుపు, పోపు సామగ్రి ఎప్పటికపుడు సిద్ధం చేసుకోవాలి. వీటి కొనుగోలుకు ప్రభుత్వం ఇస్తున్న నిధులు ఏమాత్రం సరిపోవటం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. పిల్లల్లో ఒక్కొక్కరికి బియ్యం 75 గ్రాములు, కందిపప్పు 15 గ్రాములు, వంట నూనె 5 గ్రాములు చొప్పున ఇస్తున్నారు. కూరగాయలు, ఇతర ఆహార దినుసుల కొనుగోలుకు ఒక్కొక్కరికి రూ.1.50 చొప్పున కేటాయిస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన కూరగాయల ధరలతో వండి పెట్టడం ఆర్థికంగా భారమవుతోందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక గ్యాస్‌కు 50 పైసలు చొప్పున చెల్లిస్తున్నారని, ఒక్కో గ్యాస్ సిలిండర్‌ను రూ.900 పెట్టుకుని కొనుగోలు చేస్తున్నామని సిలిండర్‌కు రూ.700 మాత్రమే ప్రభుత్వం అందిస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించి కూరగాయలు, చింతపండు తదితర సామగ్రి ఖర్చుకు పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతినెలా క్రమం తప్పకుండా నిధులు విడుదల చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

కందిపప్పు ఇవ్వడం లేదు



అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే కందిపప్పు ఆరు నెలల నుంచి ఇవ్వడం లేదు. దీంతో బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే బాలసంజీవిని పథకం ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం కిట్లు అందించాలి.

ఉండా తనూజా, బాలింత, ఎ.మల్లవరం

క్రమం తప్పకుండా ఇండెంట్ పంపుతున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు బాల సంజీవిని పథకం ద్వారా అందించే పౌష్టికాహార కిట్లకు క్రమం తప్పకుండా ఇండెంట్ పంపుతున్నాం. కందిపప్పు పంపిణీలో కొంత జాప్యం కలుగుతోంది. చిన్నారుల భోజనాలకు సంబంధించి కూరగాయలు, ఆకుకూరలు, ఇతర ఆహార దినుసులు కొనుగోలుకు ప్రతి నెల నిధులు విడుదల చేస్తున్నాం.

జానకీలక్ష్మి, ఐసీడీఎస్ మండల విస్తరణాధికారి, రౌతులపూడి

ముద్రగడ నాయకత్వంలో పార్టీ బలోపేతం



కిర్లంపూడిలో ముద్రగడను కలసిన ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం నాయకత్వంలో క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఏలేశ్వరం సొసైటీ మాజీ చైర్మన్ కొండపల్లి వెంకటేశ్వరావు (చంటిబాబు), ఎంపీటీసీ కలారి సత్యనారాయణ అన్నారు. ఏలేశ్వరం మండలం జడ్డంగిఅన్నవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం, పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. త్వరలో ప్రతి గామానికి వచ్చి పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుస్తానని తెలిపారు. సింగిరెడ్డి సోమన్నదొర, కొండపల్లి శ్రీను, అడబాల భద్రరావు, గారా రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘన సత్కారం

మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంతో పాటు వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన ముద్రగడ గిరిబాబును సోమవారం ఆ పార్టీ నాయకులు సన్మానించారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి, విజయ భారతి చెస్ట్ హాస్పటల్ వైద్యుడు గూడూరి శ్రీనివాస్ నివాసం వద్ద ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధిక ముద్రగడను ఘనంగా సత్కరించారు. గణేశుల రాంబాబు, గౌతు స్వామి, తోట రామకృష్ణ, పెంటకోట నాగబాబు, రాపేటి పెద్ద పాల్గొన్నారు.

సిటీ కేబుల్ ఎండీకి మాజీ మంత్రి రాజా పరామర్శ



త్రిమూర్తిస్వామి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, తదితరులు

తుని రూరల్: పుత్ర వియోగంతో బాధపడుతున్న సిటీ కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తిస్వామి కుటుంబ సభ్యులను సోమవారం వేర్వేరుగా మాజీ మంత్రులు పరామర్శించారు. ఎస్.అన్నవరంలోని తన నివాసంలో త్రిమూర్తిస్వామిని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, తుని మండల పరిషత్ వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, తుని మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు తదితరులు పరామర్శించి, హేమశంకర్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. తుని మున్సిపల్ మాజీ చైర్మన్ యినుగంటి సత్యనారాయణ, నాయకులు కొయ్యా శ్రీనుబాబు, చోడిశెట్టి గణేష్ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా సేవలందించాలి



స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ సుబ్బారావు

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా సేవలందించాలని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఆదేశించారు. రత్నగిరిపై వ్రతపురోహిత సూపర్‌వైజర్లు, ఇతర అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. అన్నవరం దేవస్థానంలో వ్రతపురోహితుల వ్యవహారశైలిపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. వ్రతపురోహితులు సకాలంలో విధులకు హాజరుకావాలన్నారు. వ్రతాలనంతరం భక్తులను కానుకలు, దానాలు పేరుతో ఇబ్బంది పెట్టవద్దని ఆదేశించారు. భక్తులు సంతోషంగా ఇచ్చిన మొత్తాన్ని తీసుకోవాలన్నారు. కాగా సమావేశంలో పాల్గొన్న వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు ఛామర్తి కన్నబాబు మాట్లాడుతూ త్వరలోనే 250 మంది పురోహితులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయాలన్నీ తెలియజేస్తామని చెప్పారు. సమావేశంలో వ్రత విభాగ ఇన్‌చార్జి, ఏసీ రామ్మోహన్‌రావు, స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితులు మంథా రామ్మూర్తి, తౌయ్యేటి హరిబాబు, పి.అంజిబాబు, అల్లంరాజు శ్రీనివాసశర్మ, నాగాబట్ల రవిశర్మ పాల్గొన్నారు.

ఆటోల నిర్వహణకు మార్గదర్శకాలు

అన్నవరం రైల్వేస్టేషన్, బస్ స్టేషన్లు -రత్నగిరి మధ్య తిరుగుతున్న ఆటో డ్రైవర్లకు కొన్ని నిబంధనలు విధించారు. ఈఓ ఆదేశాల మేరకు దేవస్థానం ఈఈ వీ రామకృష్ణ, సర్పంచ్ కుమార్‌రాజా, అన్నవరం ఎస్‌ఐ హరిబాబు సోమవారం ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి వీటిని తెలియజేశారు.

ఆహ్వాన పత్రాల ఆవిష్కరణ

ఏలేశ్వరం: పవిత్ర ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 10న నిర్వహించే ఏకాహ ఏకాహ మహోత్సవ ఆహ్వాన పత్రాలను మండలంలోని సిరిపురంలో సోమవారం ఆవిష్కరించారు. సిరిపురంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాస్వామి ఆలయంలో ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ నెల 10న జరిగే ఏకాహ మహోత్సవంలో భాగంగా అనపర్తి వెంకటకృష్ణంరాజు, కామేశ్వరి దంపతులతో విఘ్నేశ్వరపూజ, మండపారాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, అఖండ దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఏకాహంలో చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన భజన బృందాలు పాల్గొంటాయి. ఆలయ కమిటీ సభ్యులు వెలుగూరి హరేరామ్, ధనేకుల వీరభద్రరావు, అనపర్తి భాను, కె.రవి, వైఆర్‌కే మూర్తి పాల్గొన్నారు.

5,400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాలలో సారా బట్టీలపై సోమవారం అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈఎస్‌టీఎఫ్ బృందాలు, తుని ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడి చేసి చేశారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 5,4000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తుని ఎక్సైజ్ ఎస్‌ఐ శాస్త్రి తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారుచేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గెద్దనాపల్లిలో 1,200 లీటర్లు ధ్వంసం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి మండలం గెద్దనాపల్లిలో సారా స్థావరాలపై సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్టు ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత పోలీసులదే

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఎంపీటీసీ కాశీ జగన్నాథాన్ని పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు: గ్రామాల్లో శాంతి భద్రతలను పర్యవేక్షించాల్సింది పోలీసులేనని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని శరభవరంలో టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడి ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు అమరాది కాశీ జగన్నాథంను సోమవారం రాత్రి ఆయన పరామర్శించారు. అధైర్య పడవద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలలుగా టీడీపీ శ్రేణులు రెచ్చగొట్టె ధోరణిలో వ్యవహరిస్తున్నా, తమ వర్గీయులను ప్రశాంతంగా ఉండాలంటూ చెబుతూ వచ్చానన్నారు. దాడికి పాల్పడడం బాధాకరమన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను గ్రామంలో లేకుండా చేస్తామని గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోందని, మంచి సంప్రదాయం కాదన్నారు. దాడి ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఆయన వెంట ఏలేశ్వరం వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఏనుగు శ్రీను, గజ్జనపూడి సర్పంచ్ గొనగాల అప్పలరాజు, అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యుడు దోో చిట్టిబాబు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు జల్లి గంపల ప్రభాకరరావు, రామిశెట్టి బులిరామకృష్ణ, తదితరులు ఉన్నారు. కాగా ఎంపీటీసీ అమరాది కాశీ జగన్నాథంను వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, బెహరా లక్ష్మీప్రసన్న, పలివెల నాగేంద్రబాబు, రంగనాధం అబ్బాయి, తాతపూడి బుజ్జి తదితరులు పరామర్శించారు.

యువత సాయి సిద్ధును ఆదర్శంగా తీసుకోవాలి



తునిలో బాడీ బిల్డర్ సాయి సిద్ధును సత్కరిస్తున్న అలయెన్స్ క్లబ్ ప్రతినిధులు

తుని: జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన రాయి సాయి సిద్ధును యువత ఆదర్శంగా తీసుకోవాలని అలయెన్స్ క్లబ్ అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ సూచించారు. స్థానిక కొత్తపేట సీతారామా యోగా సెంటర్లో సోమవారం సాయంత్రం క్లబ్ గౌరవ అధ్యక్షుడు కుచ్చర్లపాటి భీమరాజు ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో తృతీయ స్థానం సాధించిన సాయి సిద్ధును ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపేందుకు అవసరమైన ప్రొటీన్ ఫుడ్ సమకూరిస్తే ప్రథమ స్థానం సాధించేందుకు కృషి చేస్తానని సాయి సిద్ధు తెలిపారు. దాడిశెట్టి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దాడిశెట్టి శ్రీనివాస్ ప్రొటీన్ ఫుడ్‌కు రూ.15 వేలు అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, ఆంజనేయ ప్రసాద్, నూకయ్య శెట్టి, నామన రవి, రాజబాబు, నాయుడు, స్వామి, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగబాబు

జగ్గంపేట: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ అత్తులూరి నాగబాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల పనితీరుపై ఎంపీపీ సమీక్షించారు. గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు లేవనెత్తిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో 2024-25 సవరణ బడ్జెట్, 2025-26అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఒమ్మి రఘురాం, ఎంపీడీఓ చంద్రశేఖర్, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో అధిక లాభాలు



రాచపల్లిలో డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: వ్యవసాయంలో యంత్రాల వినియోగం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం స్టేట్ టిమెటిక్ లీడ్ జానకి అన్నారు. మండలంలోని రాచపల్లిలో పెదిరెడ్డి సత్యనారాయణ వ్యవసాయ క్షేత్రంలో 22 జిల్లాలకు చెందిన ఎన్‌పీఎం షాపుల యజమానులకు కషాయాల తయారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం, కషాయాల తయారీ, డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం డ్రోన్లతో జీవామృతం, ఇంగువ కషాయాన్ని పిచికారీ చేశారు. మండల వ్యవసాయ అధికారి వై.గంగాధర్, బుజ్జిబాబు, జిల్లా కోఆర్డినేటర్ గణేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల సంఘం అధ్యక్షుడిగా సత్తిబాబు

గోకవరం: మండల ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు యజమానుల అసోసియేషన్ అధ్యక్షుడిగా స్థానిక ఎరువుల వ్యాపారి బత్తుల సత్తిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోకవరంలో సోమవారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా సత్తిబాబు, కార్యదర్శిగా లింగంపల్లి సుబ్బారావులను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

వైభవంగా సామూహిక సుదర్శన హోమం



సామూహిక సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక సుదర్శన నారసింహ హోమం సోమవారం వైభవంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో భక్తులు సామూహిక పూజలు చేయగా అర్చకులు శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు సుగంధ ద్రవ్యాలు, నూతన వస్త్రాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. టి.తిమ్మాపురం శివారు విష్ణుపురంలో మహావిష్ణు ఆలయంలో శ్రీలక్ష్మీనారాయణ హోమం, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు.

సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని వినతి



అమరావతిలో హైకోర్టు న్యాయమూర్తిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న తుని న్యాయవాదులు

తుని: తునిలో సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం అమరావతిలో హైకోర్టు పోర్టు పోల్ న్యాయమూర్తి నైనాల జయ సూర్యను కలిసి వినతి పత్రం సమర్పించినట్టు తుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సలుగు కృష్ణశేఖర్ తెలిపారు. ప్రస్తుతం బ్యాంకుకాలనీలో కోర్టు నిర్మాణం పనులు పూర్తి చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారని కృష్ణశేఖర్ తెలిపారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి మేడిది గణేష్, న్యాయవాదులు యనమల సతీష్, సీహెచ్ వెంకటరమణ, బోణం చినబాబు, సాకా సత్తిబాబు పాల్గొన్నారు.

బాలయ్య కుటుంబానికి పరామర్శ



ప్రత్తిపాడులో బాలయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు: గ్రామానికి చెందిన పోలిశెట్టి బాలయ్య ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను సోమవారం ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. ఏలూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు కొట్టేటి సాయిబాబా భార్య ఇటీవల మృతి చెందారు. సాయిబాబాను మురళీకృష్ణంరాజు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోలా తాతబాబు, కృష్ణ, కాశీ, సాయి, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామ సభలపై అవగాహన ర్యాలీ

శంఖవరం: గ్రామాల్లో దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలకు రీ సర్వే గ్రామ సభల ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ పోతురాజు అన్నారు. శంఖవరంలో సోమవారం రీ సర్వేపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కొన్ని రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే నిర్వహించి భూ సమస్యలు పరిష్కరించామన్నారు. ఆన్‌లైన్‌లో సర్వే నంబర్ లేకపోయినా రీ సర్వే ద్వారా పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పర్వత సురేష్, చింతనీడి కుమార్, జనసేన నాయకుడు మేకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కిర్లంపూడి: భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె.చిరంజీవి సూచించారు. మండల పరిధి ఎస్.తిమ్మాపురంలో సోమవారం ర్యాలీ నిర్వహించి భూముల రీసర్వే ప్రాధాన్యతను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో రీసర్వే ఉప తహసీల్దార్ ఆర్.శ్రావణి, ఎంఎల్ఎస్ఓ షేక్ బషీర్, వీఆర్వో ప్రసాద్, సర్వేయర్ రమణ పాల్గొన్నారు.

రహదారి భద్రతా చట్టాలపై అవగాహన

కిర్లంపూడి: రోడ్డు భద్రతా చట్టాలను ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఏనుగువీధి సెంటర్‌లో ఆటో ఓనర్లు, డ్రైవర్లకు సోమవారం రోడ్డు భద్రతా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ల వద్ద డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఆటో ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రయాణికుల ముసుగులో చోరీలకు పాల్పడే మహిళలు ఆటో ఎక్కినట్టు అనుమానం వస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ నాగళ్ల వెంకటరమణ, ఎవీ సుబ్బిరామిరెడ్డి పాల్గొన్నారు.